నమస్తే తెలంగాణ
హైదరాబాద్, ఆదివారం, 2 మార్చి 2025
SUNDAY, MARCH 2, 2025

లక్ష్మీనరసింహుడికి పోచంపల్లి చేనేత పట్టు వస్త్రాలు

భూదాన్ పోచంపల్లి : యాదగిరిగుట్ట దేవస్థానం ప్రధానాచార్యుడికి పట్టు వస్త్రాలు అందజేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 1 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పోచంపల్లి పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు సమర్పించనున్న పట్టు వస్త్రాలను శనివారం యాదగిరిగుట్టకు తీసుకెళ్లారు. అమ్మవారి కల్యాణానికి రెండు పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరెలు, స్వామివారికి రెండు పట్టు పంచెలు, రెండు శాలువాలు దేవస్థాన అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్, పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, దేవాలయ చైర్మన్ సీత సత్యనారాయణ, చేనేత నాయకులు పాల్గొన్నారు.

స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన సోలాపూర్ చాట్ల శారీ సెంటర్

యాదగిరిగుట్ట : మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన చాట్ల శారీ సెంటర్ ఆధ్వర్యంలో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. శనివారం బ్రహ్మోత్సవాల మొదటి పూజలో చాట్ల కేశవ్, ఉమ దంపతులు, వారి కుమారుడు కృష్ణకాంత్ పాల్గొని రూ.2.50 లక్షల విలువైన పట్టు వస్త్రాలను ఆలయ డీఈఓ భాస్కర్‌శర్మకు అందజేశారు. ఆయన వెంట టీటీడీ దేవస్థానం అడ్వైజరీ కమిటీ సభ్యులు వడ్లోజు వెంకటేశ్ ఉన్నారు.

రామన్నపేట దవాఖాన సూపరింటెండెంట్‌గా చిన్నానాయక్

చిన్నానాయక్‌ను సన్మానిస్తున్న వైద్యులు

రామన్నపేట, మార్చి 1 : రామన్నపేట దవాఖాన సూపరింటెండెంట్‌గా డాక్టర్ చిన్నానాయక్ శనివారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. దవాఖాన సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఈశ్వర్ ఉన్నత చదువుల కోసం ఇన్ సర్వీస్‌లో గాంధీ మెడికల్ కాలేజీకి వెళ్లారు. దీంతో జిల్లా డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్న చిన్నానాయక్ అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది చిన్నానాయక్‌ను సన్మానించారు. ఈశ్వర్‌ను కూడా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా చిన్నానాయక్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యులు బి.వీరన్న, శ్రీనివాస్, విజయలక్ష్మి, మాధవాచారి పాల్గొన్నారు.

బెల్టు షాపులు నడిపితే కఠిన చర్యలు

- ఎక్సైజ్ సీఐ దీపిక

పాముకుంటలో విచారణ జరుపుతున్న ఎక్సైజ్ సీఐ దీపిక

రాజాపేట, మార్చి 1 : గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ దీపిక హెచ్చరించారు. మండలంలోని పాముకుంటలో వేలం పాటలో బెల్టు షాపు నిర్వహిస్తున్నారని తెలుసుకున్న ఆమె శనివారం గ్రామాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. వేలం పాడిన బెల్టు షాపును తనిఖీ చేశారు. వేలం పాటలు వేసి బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆమె వెంట ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల పరిశోధనలకు జైటెక్ సంస్థ ప్రోత్సాహకం

గైడ్ ఉపాధ్యాయుడు నవీన్, విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న జైటెక్ సంస్థ అధినేత శివప్రసాద్

తుర్కపల్లి, మార్చి 1 : ఢిల్లీలో జనవరి 10, 12 తేదీల్లో జరిగిన యూత్ ఫెస్టివల్‌లో మండలంలోని రాంపూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు లూనావత్ అఖిల్, బానోతు అరుణ్ రూపొందించిన ఎలక్ట్రిక్ నానో ట్రాక్టర్‌ను ప్రదర్శించారు. పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను జైటెక్ ఇండియా సంస్థ అధినేత కస్తూరి శివప్రసాద్ అభినందించడంతోపాటు ఒక్కో విద్యార్థికి రూ.5వేల నగదు ప్రోత్సాహకం, జ్ఞాపికలు అందజేశారు. మరిన్ని పరిశోధనల ఆవిష్కరణ కోసం పాఠశాల గైడ్ టీచర్ కోట నవీన్‌కుమార్‌కు ప్రోత్సాహకంగా రూ.50వేలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంబటి శోభారాణి, జైటెక్ సంస్థ బృందం పుల్లయ్య, కురుమయ్య, రవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులకు మంచి భోజనం పెట్టాలి



ఆత్మకూరు(ఎం) ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న మండల ప్రత్యేకాధికారి రాజారాం

ఆత్మకూరు(ఎం), మార్చి 1 : విద్యార్థులందరికీ నాణ్యతతో కూడిన పరిశుభ్రమైన భోజనం అందివ్వాలని మండల ప్రత్యేకాధికారి రాజారాం అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. బియ్యంలో లక్కపురుగు ఉండడం, కూరగాయలు తాజాగా లేకపోవడంతో వంట ఏజెన్సీలను హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాములునాయక్, ఇన్‌చార్జి ఎంపీఓ లోకేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం

రామన్నపేట : కృష్ణవేణి పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

చౌటుప్పల్, మార్చి 1 : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి, పంతంగి ప్రాథమిక పాఠశాలల్లో శనివారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి తోటి స్నేహితులకు పాఠాలు బోధించారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, బల్ల బాలరాజు, తంగడపల్లి పాఠశాల చైర్మన్ జహంగీర్‌బీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఎంఈఓ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు మాధవరెడ్డి పాల్గొన్నారు.

రామన్నపేట : మండలంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కరస్పాండెంట్ గంగుల నరేందర్‌రెడ్డి, ప్రిన్స్‌పాల్ బి.యాదగిరి బహుమతులు అందజేశారు.

తుర్కపల్లి : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు ఒక్క రోజు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయుడు రాంపల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : మండలంలోని జూలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు డి.సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీబీనగర్ : మండలంలోని గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గాయం బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోత్కూరు : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవం జరుపుకొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ల పదవీ కాలం పొడిగింపు

- మరో ఆరు నెలలు పొడిగిస్తూ డీసీఓ శ్రీధర్ ఉత్తర్వులు

యాదగిరిగుట్ట, మార్చి 1 : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ల పదవీ కాలం మరో 6 నెలలు పొడిగిస్తూ జిల్లా సహకార అధికారి ఎన్.శ్రీధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 15న చైర్మన్ల పదవీ కాలం పూర్తి కాగా.. ఈ ఉత్తర్వులతో వారు మరో 6నెలలపాటు ఆగస్టు 15వరకు పదవుల్లో కొనసాగనున్నారు. ఈ లోగా ప్రభుత్వం ఏ సమయంలోనైనా ఎన్నికలకు వెళ్తే ప్రస్తుత చైర్మన్ల పదవిని రద్దు చేసే అవకాశం ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పీఏసీఎస్ ప్రస్తుత మేనేజింగ్ కమిటీల్లో ఎన్నికైన సభ్యులను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి సంబంధించిన వ్యవహారాలను నిర్వహించేందుకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీలుగా వ్యవహరించనున్నారు. ఇందులో ప్రస్తుతం పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్మన్‌తో పాటు మరో 12 మంది సభ్యులు ఉంటారు. వైస్ చైర్మన్ పదవిని తొలగించారు. జిల్లాలోని 21 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ప్రస్తుత చైర్మన్లు పర్సన్ ఇన్‌చార్జి (పీఐసీ) చైర్మన్లుగా మరో ఆరు నెలలపాటు ఉంటారు.

వంగపల్లి పీఏసీఎస్ పీఐసీగా గొంగిడి మహేందర్‌రెడ్డి కొనసాగింపు

వంగపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి (పీఐసీ) చైర్మన్‌గా గొంగిడి మహేందర్‌రెడ్డి మరో 6నెలల పాటు వ్యవహరించనున్నారు. పీఐసీ సభ్యులుగా ఎగ్గిడి బాలయ్య, బి.గౌరమ్మ, డి.కృష్ణ, ఎస్.వీరస్వామి, ఎస్.సత్తిరెడ్డి, పి.అనిత, బి.యాదిరెడ్డి, ఎ.రమేశ్, జి.శ్రీనివాస్, ఎం.రామచందర్, కె.ఉపేందర్‌నాయక్ కొనసాగనున్నారు. యాదగిరిగుట్ట పీఏసీఎస్ పీఐసీ చైర్మన్‌గా ఇమ్మడి రామిరెడ్డి, మరో 12 మంది సభ్యులుగా వ్యవహరించనున్నారు.

మూసీ శుద్ధీకరణపై అఖిలపక్ష సమావేశం పెట్టాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య

పార్టీ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య

భూదాన్ పోచంపల్లి, మార్చి 1 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్ష పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి మూసీ శుద్ధీకరణ, ప్రక్షాళనపై డీపీఆర్ తయారు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూసీ ప్రక్షాళన పేరుతో పేద, మధ్య తరగతి ప్రజల నివాసాలను కూల్చడం సరికాదన్నారు. మూసీ ఆధారిత ప్రాంతాల్లో పెరుగుతున్న పరిశ్రమల కాలుష్యాన్ని నివారించకుండా, పరిశ్రమల వ్యర్థాలను మూసీలో కలుపడం వల్ల నీటి కాలుష్యం పెరిగి ప్రజలు అనేక రకాల వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సర్వే చేసి మూసీ ప్రక్షాళనపై దృష్టి పెట్టాలని సూచించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ మాట్లాడుతూ మూసీ శుద్ధీకరణకు అవసరమైన చోట ఈటీపీలు, ఎస్టీపీలు ఏర్పాటు చేయాలన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనూరాధ, కొండమడుగు నర్సింహ, నాయకులు గూడూరు అంజిరెడ్డి, మాటూరి బాలరాజు, మల్లేశం, పాండు, పెంటయ్య, కృష్ణారెడ్డి, శ్రీనివాసచారి, రామచంద్రారెడ్డి, స్వామి, నర్సింహ, కృష్ణ, యాదగిరి, పాషా, వెంకటేశ్, వెంకటనర్సు, సైదులు పాల్గొన్నారు.

'కౌండిన్య అసోసియేషన్ సేవలు అభినందనీయం'

గీత కార్మికులకు పోస్టల్ బీమా పత్రాలు అందజేస్తున్న కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాములు

ఆత్మకూరు(ఎం), మార్చి 1 : మండల కేంద్రంలోని 150మంది గీత కార్మికులకు కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా డైరెక్టర్ అతికం గిరి, కల్లుగీత కార్మిక సంఘం మండల గౌరవాధ్యక్షుడు గడ్డం దశరథగౌడ్ సహకారంతో పోస్టల్ బీమా పథకం కోసం గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించడం అభినందనీయమని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాములు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో గీత కార్మికులకు పోస్టల్ బీమా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా డెరెక్టర్ అతికం గిరి నిరుపేద గౌడ మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ కోసం లక్ష రూపాయలను గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పంజాల నర్సయ్యగౌడ్‌కు అందజేశారు. అనంతరం జయరాములు మాట్లాడుతూ ప్రభుత్వం గీత కార్మికులకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు.

కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెరుకు మల్లేశం, మాజీ అధ్యక్షుడు పొన్నగాని జహంగీర్, నాయకులు నాతి రాజు, వెంకన్న, స్వామి, కృష్ణమూర్తి, మల్లేశ్ పాల్గొన్నారు.

ఎండిన పంటలకు పరిహారం అందివ్వాలి : సీపీఎం

మందోళ్లగూడెంలో ఎండిపోయిన పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

చౌటుప్పల్, మార్చి 1 : నీళ్లు లేక ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని సీపీఎం నాయకులు కోరారు. మండలంలోని మందోళ్లగూడెంలో ఎండిన వరి పొలాలను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటలు ఎండిన రైతులకు రూ.50వేల చొప్పున నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బూర్గు కృష్ణారెడ్డి, సీపీఎం నాయకులు కొండె శ్రీశైలం, చప్పిడి రాఘవరెడ్డి, ఇట్టబోయిన శేఖర్, నీల అంజిరెడ్డి, నీల రవి, కొండె రాజమల్లు, రఘునాథరెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

చింత చెట్టు పైనుంచి పడి ఒకరు మృతి

వెంకటేశ్ (ఫైల్)

మోత్కూరు, మార్చి 1 : మున్సిపాలిటీ పరిధిలోని కొండాపురలో చింత చెట్టు పైనుంచి పడి ఒకరు మృతిచెందారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మోటకొండూరు మండలం వర్టూరు గ్రామ పంచాయతీ పరిధిలోని శాకంపల్లికి చెందిన ఏర్పుల వెంకటేశ్ (55) శనివారం కొండాపురంలోని ఓ రైతుకు చెందిన చింత చెట్టు ఎక్కి చింత పండు దులుపుతున్నాడు. ప్రమాదవశాత్తు కాలు జాకి కిందపడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేశ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహానికి శవ పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం కోసం రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నాగరాజు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఆత్మకూరు(ఎం), మార్చి 1 : సమభావన సంఘాల మహిళలు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ప్రశాంత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బ్యాంకు వద్ద శనివారం మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నిరూప, క్యాషియర్ కిరణ్‌మహి, మహేశ్, బ్యాంక్ మిత్రలు లావణ్య, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి

ఆత్మకూరు(ఎం), మార్చి 1 : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదుగాలంటే సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని ప్రభుత్వ న్యాయవ్యాది ఎంఏ రహీం అన్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన బ్రిలియంట్ పాఠశాల 15వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ప్రతికంఠం పూర్ణచందర్ రాజు, ప్రిన్సిపాల్ పావని కోటేశ్వరి, మాజీ ఎంపీపీ హేమలత, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశ్, మాజీ ఎంపీటీసీ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వలిగొండ, మార్చి 1 : మండలంలోని నెమిలకాల్వ గ్రామంలో ఇటీవల మృతిచెందిన గాదె రామకృష్ణ కుటుంబానికి స్వామి వివేకానంద ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్, సభ్యులు గాదె వెంకటేశ్, వంగాల భిక్షపతి, వంగాల గోపి, గడ్డ వెంకటేశ్, సాయిలు, నిలుగొండ వెంకటేశ్, రవి, రాజు, రాజ్‌కుమార్, ఐలేశ్ పాల్గొన్నారు.

'మాదిగ అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి'

చౌటుప్పల్, మార్చి 1 : మాదిగ అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి అన్నారు. పట్టణంలో శనివారం ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అశువులు బాసిన మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక అంబేద్కర్ ట్రస్ట్ చైర్మన్ బోయ రామచంద్రం, మాదిగ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర నాయకుడు ఊదరి వెంకటేశ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు బొడ్డు శ్రావణ్‌కుమార్, నాయకులు కిష్టయ్య, నర్సింహ, శంకర్, లింగస్వామి పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళి

యాదగిరిగుట్ట : ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేసి అశువులు బాసిన మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఆకారపు లక్ష్మీనారాయణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద శంకర్ మాదిగ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు గోపి నాగరాజు, మండల అధికార ప్రతినిధి వదిగళ్ల రాజు, నాయకులు సిద్ధు, సురేందర్, నాగరాజు, సింహాద్రి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల చంద్రస్వామి, స్థానిక నాయకులు లింగస్వామి, భిక్షపతి, రాములు, నర్సింహ, శ్రీశైలం, శంకర్, విజయ్ పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాదిగ అమరుల చిత్ర పటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిది బొట్ల శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు భూషి మహేశ్ పాల్గొన్నారు.

రామన్నపేట : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాదిగ అమరులకు నివాళి అర్పించారు. సంఘం మండలాధ్యక్షుడు నోముల చిరంజీవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడి శంకర్, నాయకులు ఈర్లపల్లి మల్లయ్య, స్వామి, దేవేందర్, మారన్న, శంకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరుల చిత్రపటాలకు నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి దుబ్బ దానయ్య, మండలాధ్యక్షుడు పల్లెర్ల రాంచందర్, బేడ బుడగ జంగాల జిల్లా అధ్యక్షుడు ఎదురుగట్ల యాదగిరి, బీసీ సంఘం మండలాధ్యక్షుడు యాదగిరి, నాయకులు అంజయ్య, సహదేవ్, శంకర్, మల్లేశం, నర్సింహ పాల్గొన్నారు.

ఆలేరు టౌన్ : పట్టణంలోని రహదారి బంగ్లాలో మాదిగ అమరులకు నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు తాటికాయల నరేందర్ మాదిగ, గూడెపు మధు, ఎంఎస్ఎఫ్ నాయకులు రమేశ్, నరేశ్, మహేందర్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ : అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు



భువనగిరి అర్బన్ : మాదిగ అమరవీరులకు నివాళులర్పిస్తున్న శంకర్

సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

గచ్చుబావి వద్ద రైతులతో కలిసి కాల్వ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 1 : సాగునీటి సమస్యల పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. బస్వాపురం నృసింహ రిజర్వాయర్ నుంచి కాల్వ ద్వారా గచ్చుబాయి, కేసారం, బాలంపల్లి, చందుపట్ల, కుమ్మరిగూడెం, వీరవెల్లి చెరువులు నింపడానికి శుక్రవారం రైతులతో కలిసి కాల్వ వెంట పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కాల్వల నిర్మాణాలకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిక్కుల వెంకటేశ్, నాయకులు రాంపల్లి కృష్ణ, రామచందర్, యాదగిరి, పాండు, వెంకట్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జడ్పీ సీఈఓ శోభారాణి

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 1 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు అత్యధిక మార్కులతో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని జడ్పీ సీఈఓ ఎన్.శోభారాణి అన్నారు. పట్టణంలోని రాయగిరి జిల్లా పరిషత్ పాఠశాలను శనివారం ఆమె సందర్శించి మధ్యాహ్న భోజన సురుకులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారితో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ఆండాలు, ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, ప్రభాకర్, షరీఫ్, కనకయ్య, భాస్కర్, రఘువీర్‌సింగ్, విజయ, అనిత పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ పాటించాలి : ఆర్డీఓ

జలాల్‌పూర్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

బొమ్మలరామారం, మార్చి 1 : పాఠశాలల్లో ప్రభుత్వం ప్రకటించిన విధంగా మెనూ పాటించాలని ఆర్డీఓ కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులపై ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు, ఒత్తిడి నివారణపై పలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎం నిర్మలజ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలి

- డీఎంహెచ్ఓ మనోహర్

విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

భువనగిరి అర్బన్, మార్చి 1 : విద్యార్థులకు వైద్య పరీక్షలు వేగవంతంగా నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి మనోహర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానలో విద్యార్థులకు శనివారం నిర్వహించిన వైద్య పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 34,400 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించామన్నారు. వారిలో 2,785 మంది విద్యార్థుల్లో రీఫ్రాక్టివ్ ఎర్రర్స్ (కంటి చూపు లోపాలు) గుర్తించబడ్డాయని తెలిపారు. కంటి చూపు లోపం ఉన్న విద్యార్థులకు భువనగిరి ఏరియా దవాఖానలో రీ స్క్రీనింగ్ నిర్వహించి తుది నిర్ధారణ చేస్తున్నారని అన్నారు. ఇందులో ఇప్పటి వరకు 1,205 మంది విద్యార్థులకు పూర్తయిందని, మిగిలిన వారికి కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ స్క్రీనింగ్‌లో దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు అవసరమైన వైద్య సహాయం అందించడంతోపాటు ఉచితంగా కండ్లద్దాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 15వరకు కొనసాగుతుందని, స్క్రీనింగ్ చేయించుకోని విద్యార్థులు నిర్దేశిత సమయానికి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి : డీఈఓ



పాఠశాలలో విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ సత్యనారాయణ

బొమ్మలరామారం, మార్చి 1 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్నాహ్న భోజనం అందించాలని డీఈఓ సత్యనారాయణ అన్నారు. మండలంలోని తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటకు వాడే వస్తువులు, మెనూ, రిజిస్టర్‌ను పరిశీలించి వంటలను రుచి చూశారు. పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై పలు సూచనలు చేశారు. విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏకాగ్రతతో చదివి ఉత్తమ ప్రతిభ కనబరుచాలని సూచించారు. అనంతరం బోయిన్‌పల్లి ప్రాథమిక పాఠశాలను, బొమ్మలరామారం జడ్పీహెచ్ఎస్‌ను సందర్శించారు. బొమ్మలరామారంలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ రోజారాణి, జీహెచ్ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు పట్టాభి, కృష్ణారెడ్డి, కృష్ణమూర్తి, భాస్కర్, నర్సింహ, అశోక్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి : సీఐ

సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సురేశ్‌కుమార్

భువనగిరి అర్బన్, మార్చి 1 : రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పట్టణ సీఐ సురేశ్‌కుమార్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం మత పెద్దలతో శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ముస్లిం, హిందువుల పండుగలైన రంజాన్, హోలీ వేడుకలు ఒకేసారి వచ్చాయన్నారు. ఆ వేడుకల్లో ఎవరికీ ఎలాంటి ఆటంకం చేయకుండా ఒకరికొకరు సహకరించుకొని పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.